ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025

పాపం.. పోలంపల్లి..!

కొత్త ఆనకట్టకు రాజకీయ గ్రహణం

- రెండు దశాబ్దాలుగా అందుబాటులోకి రాని దైన్యం
- కాంట్రాక్టర్ల మధ్య వివాదం, నేటికీ పరిష్కారం కాని సమస్య
- 20 ఏళ్లుగా రైతులకు శాపం
- ప్రాజెక్టు వద్ద తుప్పుపట్టిన గేట్లు

8

ఓఆర్ఆర్ సర్వే పూర్తి

ఎన్‌హెచ్ డేటాను పరిశీలించిన ఎన్టీఆర్, కృష్ణా జేసీలు

సమగ్ర నివేదిక.. త్వరలో గజిట్ నోటిఫికేషన్ విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు అలైన్‌మెంట్ ప్రకారం ఇచ్చిన సర్వే నెంబర్ల పరిశీలన కార్యక్రమాన్ని ఎన్టీఆర్, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్లు పూర్తి చేశారు. ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు పంపించిన భూ ప్రతిపాదనలకు సంబంధించిన సర్వే నెంబర్లను సరిపై చేసి పంపటంతో.. త్వరలో ప్రాథమిక గజిట్ నోటిఫికేషన్ 3ఏ విడుదల కానుంది.

వేగంగా..

రెండు జిల్లాల్లో అవుటర్ రింగ్‌రోడ్డు కోసం దాదాపు 1,100 ఎకరాల భూములు కావాలి. ఓఆర్ఆర్ పరిధిలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలే కాకుండా ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాలు కూడా ఉన్నాయి. మిగిలిన జిల్లాల సరిపై ఇంకా కాలేదని తెలుస్తోంది. ఓఆర్ఆర్‌కు సంబంధించి నిర్దేశిత తుది అలైన్‌మెంట్ మేరకు భూములు అవసరమైన చోట ఏయే సర్వే నెంబర్లు ఉన్నాయో ఎన్‌హెచ్ అధికారులు పెగ్‌మార్కింగ్ చేసిన ప్రకారం జాయింట్ కలెక్టర్లకు వివరాలు పంపారు. ఆ సర్వే నెంబర్లు సరైనవేనా? వేరే ఏమైనా ఉన్నాయా? ఆ భూమి సహజ స్వభావం ఏంటి? ఎలాంటి కేటగిరీ భూమి? వంటి వివరాలను జేసీలు పరిశీలించి ఎన్‌హెచ్‌కు అందించాల్సి ఉంది. దీనికోసం ఐదు జిల్లాల జేసీలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల జాయింట్ కలెక్టర్లు ఇలక్కియా, గీతాంజలిశర్మ వేగంగా స్పందించారు. త్వరితగతిన పరిశీలించి సమగ్ర నివేదికను పంపించటంతో త్వరలో గజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.



పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ వరద



నాగాయలంకలో ఇళ్లలోకి వచ్చిన నీరు

కన్నీటి లంక

వరద ప్రవాహానికి లంక గ్రామాలు అల్లాడిపోతున్నాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి నిరంతరాయంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ అడ్డుగా ఉన్న గ్రామాలను, పంటలను ముంచేస్తూ సముద్రంవైపు పరుగులు పెడుతోంది. గురువారం వరద మరింత పెరగడంతో పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరింది. పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ ప్రవాహం ముందుకు కదులుతుండగా, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

కృష్ణానది వరదతో మునుగుతున్న గ్రామాలు

ఇళ్లు, పంటలు నీటమునక.. రైతులకు తీవ్రనష్టం

- ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కులకుపైగా విడుదల
- పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తున్న వరద
- కోతకు గురవుతున్న యడ్లంక కాజ్‌వే.. రాకపోకలు బంద్
- పడవలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న లంకవాసులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణానదికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండటంతో ఆ నీరంతా ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి చేరుతోంది. మధ్యలో ఉన్న లంక గ్రామాలను ముంచేస్తోంది. ఈనెల 28 వరకు వివిధ ప్రాజెక్టుల నుంచి వరద నీరు వచ్చి చేరుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనా. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది. రెండు, మూడు నెలల పాటు వరద కొనసాగుతుందని, అప్పటి వరకు లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు తప్పవని స్థానికులు చెబుతున్నారు.

జలదిగ్బంధంలో..

కృష్ణానదికి 15 రోజులుగా వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో చల్లపల్లి, తోట్లవల్లూరు, ఘంటసాల, మోపిదేవి తదితర మండలాల్లోని లంక గ్రామాలు, పంట పొలాలు నీట మునిగాయి. రెండు రోజులుగా ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని సముద్రంలోకి వదులుతుండటంతో గ్రామాలకు పడవలే ఆధారమయ్యాయి. తోట్లవల్లూరు మండలంలోని పాములలంక, తోడేళ్లదిబ్బ, తుమ్మలపచ్చిక, కనిగిరిలంక, పొట్టిదిబ్బలంక, ములకలలంక, చల్లపల్లి మండలంలోని ఆముదార్లంక తదితర లంకగ్రామాల చుట్టూ వరదనీరు చేరింది. ఈ గ్రామాల్లోని పాఠశాలలకు మిగతా 6లో..



తోట్లవల్లూరు మండలం గుర్విందపల్లి లంకలో మునిగిన కంద పంట

పంటపొలాలు మునక

కృష్ణానది లంక గ్రామాల్లో చెరకు, కంద, మొక్కజొన్న, తమలపాకు, పసుపు, పూలు, కూరగాయలు, మల్బరీతోటలను ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం వస్తున్న వరదనీటి కారణంగా లంక భూముల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. వారానికి పైగా నీరు పంట పొలాల్లో నిలబడి ఉంటే కంద, పసుపు, కూరగాయల తోటలు చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చల్లపల్లి మండలం నడకుదురు గ్రామ పరిధిలోని కరకట్ట వెంబడి ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. లోతట్టు భూముల్లో సాగు చేసిన పసుపు, కంద తోటలు నీటమునిగాయి. కందపంట మరో రెండు నెలల్లో చేతికి వస్తుందని, ఈ తరుణంలో నీటమునగడంతో దుంపలు భూమిలోనే కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు సాగు చేసి రెండు నెలలైందని, మొక్కదశలో ఉన్న పసుపు పైరు వారానికి పైబడి నీటిలోనే ఉండిపోతే చనిపోతుందంటున్నారు. మోపిదేవి మండలం కే కొత్తపాలెం, మోపిదేవివార్పు, బొబ్బర్లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో పంటపొలాల్లోకి వరద నీరు చేరుతోంది.

నేడు దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు

6



కోసూరులో నాలుగు ఆలయాల్లో చోరీలు

- వెండి, బంగారు ఆభరణాలతో పాటు నగదు అపహరణ

8

గృహ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

- వివిధ శాఖల పనితీరుపై కలెక్టర్ బాలాజీ సమీక్ష

పునర్విభజన మాటేంటి?

29న ఉమ్మడి కృష్ణాలో మంత్రుల బృందం పర్యటన

- ద్విసభ్య బృందంలో నాదెండ్ల మనోహర్, పి.నారాయణ
- గన్నవరం, పెనమలూరు, నూజివీడు సందర్శన
- గ్రేటర్ విజయవాడ విలీన గ్రామాల పరిశీలన
- అదేరోజు లిఖితపూర్వకంగా ప్రజాభిప్రాయ సేకరణ
- అభ్యంతరాలు, విజ్ఞప్తులు, సలహాల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాల పునర్విభజన చిక్కుముడులు తేల్చటానికి మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈనెల 29న ఉమ్మడి కృష్ణాజిల్లాలో పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ ఉంటారు. పునర్విభజన సమస్యలపై ఇటీవల అమరావతిలోని సచివాలయంలో మంత్రుల బృందం భేటీ అయ్యింది. జిల్లాల విభజనకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు తీసుకోవాలని మంత్రుల బృందం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకే ఈ బృందం జిల్లాల బాట పడుతోంది.

నూజివీడు విలీనంపై సాధ్యాసాధ్యాలు

నూజివీడును కృష్ణాజిల్లాలో విలీనం చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అప్పట్లో నూజివీడును కృష్ణాజిల్లాలో కలపమని కోరిన ప్రజలు ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో కలపమంటున్నారు. నూజివీడుకు విజయవాడ దగ్గర కాబట్టి ఈ ప్రతిపాదన చేశారు. ఈ నేపథ్యంలో మంత్రుల బృందం నూజివీడు భౌగోళిక పరిస్థితులను తెలుసుకోనుంది.

ఎవరెవరిని కలుస్తారు..?

ఈనెల 29న ఉమ్మడి కృష్ణాజిల్లాకు రానున్న మంత్రుల బృందం జిల్లా కేంద్రాల్లోని ప్రజలను కలవనుంది. వైసీపీ హయాంలో జరిగిన జిల్లాల విభజనపై అభ్యంతరాలు, ఇబ్బందులు, సలహాలను లిఖితపూర్వకంగా స్వీకరిస్తారు. ప్రజలు, మిగతా 6లో..



సైబర్ మోసం

- విశ్రాంత ఉపాధ్యాయుడికి టోకరా
- బెదిరించి రూ.18.50 లక్షలు హాంఫట్
- మోసం తెలిసి.. పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి వల వేసిన సైబర్ నేరగాళ్లు రూ.18.50 లక్షలు చాకచక్యంగా లాగేశారు. వివరాల్లోకి వెళితే.. విస్సన్నపేటకు చెందిన ఓ విశ్రాంతి ఉపాధ్యాయుడి ఇద్దరు అబ్బాయిలు అమెరికాలో ఉంటున్నారు. ఇక్కడ ఆయన తన భార్యతో కలిసి ఉంటున్నారు. ఈనెల 17న వారు ఓ శుభకార్యానికి వెళ్లారు. కల్యాణ మండపంలో ఉండగా, ఒక వ్యక్తి ఫోన్‌చేసి ఎయిర్‌టెల్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని, బెంగళూరు పోలీసులు మాట్లాడతారని చెప్పి మరో వ్యక్తికి ఫోన్‌కాల్ కలిపాడు. తాను బెంగళూరు పోలీసు అధికారినని చెప్పి అత్యవసరంగా ఇంటికి రప్పించి వీడియోకాల్ చేశాడు. కుడి, ఎడమ వైపున జాతీయ జెండాలు ఏర్పాటు చేసుకుని, ఖాకీ యూనిఫాంలో ఉన్న వ్యక్తి విశ్రాంత మిగతా 6లో..

కోరలు చాస్తున్నాయ్



జీజీహెచ్‌కు క్యూ కడుతున్న పాముకాటు బాధితులు

- ఏడు నెలల వ్యవధిలో 214 కేసులు
- 210 మంది చికిత్స.. నలుగురు మరణం
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన రోగులు
- వర్షాల చల్లదనానికి బయటకు వస్తున్న సర్పాలు
- వరదల్లో కొట్టుకొచ్చి పొలాలు, ఇళ్లల్లోకి ప్రవేశం
- రైతులు జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన
- ఇంటి ఆవరణలో పరిశుభ్రత ముఖ్యమని హితవు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాముకాట్ల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కొత్త ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 214 మంది పాముకాటుకు గురయ్యారు. ఏడు నెలల్లో నలుగురు మరణించారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంఖ్య అధికమే. 2023లో పాముకాటుకు 582 మంది గురికాగా, 477 మంది ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో నలుగురు చనిపోయారు. 2024లో 444 మంది పాముకాటుకు గురికాగా, 399 మంది ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆరుగురు మరణించారు. ఈ ఏడాది ఏడు నెలలకు 214 మంది పాముకాటుకు గురికాగా, 210 మంది ఆసుపత్రిలో మిగతా 6లో..



సంపటాలమ్మను దర్శించుకున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి వీఆర్కే కృపాసాగర్, గుంటూరు జడ్జి సత్యవతి దంపతులు

సంపటాలమ్మ సేవలో న్యాయమూర్తులు

చల్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి వీఆర్కే కృపాసాగర్, గుంటూరు ఫస్ట్ అడిషనల్ జడ్జి సత్యవతి దంపతులు కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి గురువారం చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు చల్లపల్లి కోటేశ్వరరావును ఆలయ విశేషాలు అడిగి తెలుసుకున్నారు. పొట్టిశ్రీరాములు వీధిలో (పోలీస్‌స్టేషన్ దగ్గర) తమ పూర్వీకుల గృహం ఉండేదని, తాను చల్లపల్లిలోనే జన్మించినట్టు న్యాయమూర్తి కృపాసాగర్ తెలిపారు.

నేడు దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. ఈసారి ఐదు శుక్రవారాలు రావటంతో చివరి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను తలపెట్టారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఆర్జిత సేవ కింద రూ.1500లు చెల్లించిన మహిళల చేత సామూహిక వ్రతం చేయిస్తారు. అనంతరం 10 నుంచి 11.30 గంటల వరకు ఉచితంగా వ్రతాలను నిర్వహిస్తారు. తెల్ల రేషన్ కార్డు ఉండి, ముందుగా టిక్కెట్లు తీసుకున్న మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. రూ.1500లు టిక్కెట్ ఆర్జిత సేవ కింద వ్రతంలో పాల్గొన్న మహిళలకు రూ.300 దర్శనం, ఉచిత వ్రతంలో పాల్గొన్న మహిళలకు రూ.100 రుసుము టిక్కెట్ లైన్‌లో అమ్మవారి దర్శనం కల్పిస్తారు. టిక్కెట్ తీసుకున్న మహిళకు మాత్రమే దర్శనానికి అనుమతి ఉంటుంది.

అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు స్పౌజ్, మ్యూచువల్ గ్రౌండ్స్, అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తులు కోరుతున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. ఈనెల 21 నుంచి 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును మండల విద్యాశాఖాధికారితో 22 నుంచి 25వ తేదీ వరకు ధృవీకరించుకోవాలన్నారు. 23 నుంచి 26 వరకు జిల్లా విద్యాశాఖాధికారిచే ధృవీకరించుకోవాలని, దరఖాస్తులను 27న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందన్నారు. 28, 29 తేదీల్లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ధృవీకరణ, తుది ప్రక్రియ అనంతరం 30న జాబితాలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు లీప్ యాప్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మెయిల్ ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని డీఈవో రామారావు తెలిపారు.

పీహెచ్‌సీ ఆయా మిస్సింగ్

- యూడీసీ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు .. ఆసుపత్రి ఎదుట ఆందోళన



మందా చిరంజీవి (ఫైల్‌ఫొటో)

జి.కొండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు పీహెచ్‌సీలో ఆయాగా పనిచేస్తున్న మంద చిరంజీవి గురువారం ఉదయం నుంచి కనపడకుండా పోయింది. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనతో ఫోన్‌లో 'నన్ను మర్చిపోండి.. నాకు బాధగా ఉంది' అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిందని భర్త ఏసు పోలీసులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు, దళితవాడ వాసులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకొని నిరసన చేపట్టారు. 28నెలలుగా కనీస వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని, యూడీసీ శ్రీనివాసరావు బిల్లులు చేయకుండా వేధించడం వల్లే ఆయా ఎటో వెళ్లిపోయిందని ఆమె బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నరాణి తెలిపారు. ఈ విషయంపై యూడీసీ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఆయాను వేధించలేదని, కొంత వేతనం ఆమె బ్యాంకు ఖాతాలో వేశామని చెప్పారు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



చెస్ టోర్నమెంట్ చాంపియన్ షిప్‌ను ప్రారంభిస్తున్న రవినాయుడు

చెస్ చాంపియన్ షిప్ టోర్నీ ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలో చదరంగాన్ని ఒక పాఠ్యాంశంగా చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయడం జరుగుతందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. వీబీ సిద్ధార్థ కళాశాలలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌ను రవినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి శాప్ ఇండోర్ స్టేడియాల్లో చదరంగ శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా పేద విద్యార్థుల శిక్షణ కోసం శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో 15 రాష్ట్రాల నుంచి సుమారు 250మంది, నగరం నుంచి 80మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌వి చైర్మన్ శ్రీనివాసరాజు, సిద్ధార్థ కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న సంఘం ప్రతినిధులు గద్దెచక్రధర్, మామిడి సీతారామయ్య, తదితరులు

నాలా చట్టం రద్దుపై నరెడ్కో హర్షం

భారతీనగర్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గురువారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నాలాచట్టం రద్దు నిర్ణయాన్ని ఏపీ నరెడ్కో కమిటీ స్వాగతిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు గద్దెచక్రదర్, ప్రధాన కార్యదర్శి మామిడి సీతారామయ్య తెలిపారు. ఎల్ఐసీ కాలనీలోని రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) రాష్ట్రకార్యాలయంలో ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. నాలా చార్జీలను తగ్గించడం, బిల్డింగ్, లేఅవుట్ అనుమతులను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా సులభతరం చేయడం కోసం ప్రయత్నాలు చేస్తూ వచ్చిందని, ఈ కృషికి ఫలితమే తాజాగా నాలా చట్టాన్ని రద్దు చేసి, ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్(ఇడిసి) విధించడం ద్వారా ప్రభుత్వం గణనీయమైన నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్‌లతో పాటు సంబంధిత శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షులు పరుచూరి కిరణ్ కుమార్, కోశాధికారి చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరంలో వరద కల్లోలం!

- పెరుగుతున్న వరద ఉధృతి
- లంకల్లో వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం
- ముంపులో పసుపు, కంద, అరటి, కూరగాయల పొలాలు



చల్లపల్లి మండలం రాముడుపాలెం వద్ద కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

చల్లపల్లి/తోట్లవల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న కృష్ణా వరద నీరు ఉధృతంగా దిగువకు ప్రవహిస్తోంది. బ్యారేజీ వద్ద ఐదు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో నదిలో నీటిప్రవాహం పెరిగింది. దీంతో తీరాన ఉన్న వాణిజ్య పంటల్లోకి నీరు చేరుతోంది. చల్లపల్లి మండలం రాముడుపాలెం వద్ద వరద ప్రవాహంతో పుష్కరఘాట్ నీటమునిగింది. లచ్చిగానిలంక భూభాగానికి సమాంతరంగా నదిలో వరదనీటి ప్రవాహం సాగుతోంది. నదీగర్భంలో ఉండే లంక పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వరద పెరుగుతుండటంతో నదిపక్కనే ఉన్న పంటచేలల్లోకి నీరు చేరుతోంది. నడకుదురు వద్ద చేలు నీటమునిగాయి. రెండు రోజులుగా పసుపు, కంద చేలల్లో వరదనీరు ఉందని, రైతులు చెబుతున్నారు. వరద పెరిగిన కొద్దీ మరిన్ని వాణిజ్య పంటలు నీటిముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. నది పక్కనే సాగుచేస్తున్న పసుపు, బీర, బెండ తోట పూర్తిగా నీటమునిగింది. రెండు నెలల్లో కంద చేతికందే దశలో ఉందని, నెలముందుగా సాగుచేసినప్పటికీ వరదబారిన పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు నీరు ఉంటే కంద ఎందుకూ పనికిరాదని, పసుపు పంటను సైతం కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద పెరిగినకొద్దీ నష్టం మరింతగా పెరిగే ప్రమాదం ఉంది.

లంకల్లో ముంపుబారిన పంటలు

తోట్లవల్లూరులో కృష్ణానదీపాయలు గురువారం వరదతో పోటెత్తుతున్నాయి. నదీపాయల్లో లంక గ్రామాల ప్రజలకు నాటు పడవలే ఆధారం అయ్యాయి. నిత్యావసర సరుకులకు కరకట్ట వెంబడి గ్రామాలకు వచ్చి వెళుతున్నారు. ప్రస్తుత వరదతో లంక గ్రామాలకు ఎలాంటి ముంపు భయం లేదని, 7 లక్షలు దాటితేనే గ్రామాల్లోకి వరద వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు కరకట్ట వెంబడి కళ్లంవారిపాలెం నుంచి ఐలూరు వరకు నది ఒడ్డున పంటలు నీట మునిగాయి. గ్రామాల్లో మోకటిలోతున వరదనీటితో రైతులు ఆందోళన చెందుతున్నారు. లంకల్లోని పల్లపు భూముల్లోకి వరద చేరటంతో కంద, పసుపు, అరటి తదితర పంటలు నీట మునుగుతున్నాయి.









నడకుదురు వద్ద నీటమునిగిన బెండ, బీరతోటలు, పసుపు కంద పొలంలోకి చేరిన వరదనీరు, తోట్లవల్లూరు కృష్ణాపాయలో ఉధృతంగా వరద

యూపీఎస్సీ మెయిన్స్‌కు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న 106 మంది అభ్యర్థులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లను పరిశీలించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ మెయిన్స్ పరీక్షలకు తుది ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను నగరంలోని లబ్బీపేట రెడ్‌సర్కిల్‌లోని బిషప్ అజరయ్యా బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో ఈనెల 22, 23, 24, 30, 31 తేదీల్లో ఐదురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు 106 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఈనెల 22 శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 ఎస్సే, 23 శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-2 జనరల్ స్టడీస్-1, 23 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-3 జనరల్ స్టడీస్-2, 24 ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-4 జనరల్ స్టడీస్-3, 24 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4 జనరల్ స్టడీస్-4, తిరిగి 30 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-ఎ ఇండియన్ లాంగ్వేజ్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-బి ఇంగ్లీష్, 31 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పై పరీక్షల నిర్వహణకు 11మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఆరుగురు విభిన్న ప్రతిభావంతులు, పరీక్షలు రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఇద్దరు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అభ్యర్థుల హాల్‌టిక్కెట్లలో నమోదుచేసిన పరీక్ష కేంద్రంపేరు అభ్యర్థి రాసిన పరీక్ష కేంద్రం ఒకే విధంగా వుండేలా జాగ్రత్త వహించాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకొనే విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, యూపీఎస్సీ సెక్రటరీ, ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ సునీల్‌కుమార్ అగర్వాల్, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్డీవో కె.చైతన్య, బిషప్ అజరయ్య బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కె.సంధ్య బి.రామకృష్ణ నాయక్ సి.లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ చైతన్య

వరదతో అప్రమత్తం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులను విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య ఆదేశించారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్, పవిత్ర సంగమం వద్ద వరద పరిస్థితిని ఆయన గురువారం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వరద పెరిగితే చినలంక, పెదలంకవాసులకు పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్నాయ్

(5వ పేజీ తరువాయి)

చికిత్స తీసుకున్నారు. నలుగురు మరణించారు.

చల్లదనానికి బయటకొస్తున్న సర్పాలు

వర్షాలు పడుతుండటం, చల్లటి వాతావరణం, ముమ్మర వ్యవసాయ పనుల నేపథ్యంలో పాములు బయటకు వస్తున్నాయి. నివాస ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించడం వల్ల కూడా కొన్ని ప్రాంతాల్లో పాములు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో రైతులు, కూలీలు పాముకాటుతో మృతి చెందుతున్నారు. అలాగే, ఇళ్ల పరిసరాల్లో కలుపుమొక్కలు, గడ్డి ఏపుగా పెరగడం కూడా పాములకు నిలయంగా మారుతోంది.

పాముకాటు వల్ల కలిగే లక్షణాలివీ..

విషం ఉన్న పాము కాటువేస్తే ఒకటి లేదా రెండు గాట్లు కనిపిస్తాయి. విషం లేని పాము కాటువేస్తే రెండు కంటే ఎక్కువ గాట్లు ఉంటాయి. తాచుపాము, కట్లపాము వంటి విషపాములు కాటువేస్తే కొంత సమయం తర్వాత చేతులు, కాళ్ల కదలికలు ఆగిపోతాయి. కండరాల నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. సమయానికి వైద్యం అందకపోతే నరాలపై ప్రభావం చూపి వ్యక్తి మరణిస్తాడు. రక్తపింజర కాటువేస్తే శరీరం లోపల అవయవాల్లో రక్తస్రావం కావడంతో పాటు చెవులు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. రక్తపింజర కాటు వేసిన ప్రదేశంలో వాపు, బొబ్బలు కనిపిస్తాయి. రక్తపింజర కాటు వేసిన 30 నిమిషాల్లో ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. లేకపోతే పరిస్థితి విషమించి చనిపోయే ప్రమాదముంది. సముద్ర పాము కాటువేస్తే కండరాల సమస్య ఎక్కువవుతుంది. వైద్యం అందడం ఆలస్యమైతే కిడ్నీపై ప్రభావం చూపి మరణించే ప్రమాదం ఉంది. అయితే, సముద్ర పాముకాటుకు గురైన వారిలో 85 శాతం మంది మరణం నుంచి తప్పించుకున్నవారే.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాము కాటువేస్తే ముందుగా ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా గాట్లను గమనించాలి. ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే పాము కాటు వేసిన ప్రదేశం నుంచి ఒక అడుగు పైభాగంలో గుడ్డముక్క/తాడుతో రక్త సరఫరాకు అంతరాయం కలగకుండా కట్టాలి. వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చేర్పించాలి. ఎట్టి పరిస్థితుల్లో నోటి ద్వారా విషాన్ని బయటకు తీయడానికి ప్రయత్నించకూడదు. విషం లేని పాము కాటు వేసిందని తెలిసినప్పటికీ అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

ఆందోళన చెందకూడదు

పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. దీనివల్ల రక్తప్రసరణ నియంత్రణలో ఉంటుంది. ఆసుపత్రికి వచ్చిన వెంటనే టెట్‌వాక్ ఇంజక్షన్ ఇస్తాం. కొన్నిసార్లు ఏ పాము కాటువేసిందో నిర్ధారించలేం. అటువంటి సమయంలో ఈ వ్యాక్సిన్ పనిచేస్తుంది. వ్యాక్సిన్ ఇచ్చాక బాధితుడికి గంటకోసారి రక్తపరీక్ష చేయాలి. రక్తం ఏ స్థాయిలో గడ్డ కడుతుందో తెలుసుకోవడంతో పాటు 24 గంటల్లో 10 యాంటీ వీనం ఇంజక్షన్లు ఇవ్వాలి. బాధితుడి పరిస్థితిని బట్టి ఈసీజీ తీయాలి. మొదటి డోస్ వేసినప్పటి నుంచి 24 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలి.

– డి.ఇందిరాదేవి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, ప్రభుత్వాసుపత్రి

సైబర్ మోసం

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడితో వీడియో కాల్ మాట్లాడాడు. ఆయన ఆధార్ కార్డు నెంబరుతో వేర్వేరు వ్యక్తులు సిమ్‌లు తీసుకున్నారని, వాటితో ముంబైలోని కెనరా బ్యాంక్‌లో ఖాతాలు తెరిచారని చెప్పాడు. సదా ఘట్కర్ అనే వ్యక్తి అమ్మాయిలను అక్రమ రవాణా చేస్తున్నాడని, అతనికి వచ్చే డబ్బు ఈ ఖాతాల్లో జమ అయ్యాయని బెదిరించాడు. ఈ మొత్తం సుమారు రూ.30 లక్షల వరకు ఉందని, ఆ డబ్బు ఎవరిదో తేల్చడానికి రూ.50 లక్షలు పంపాలని చెప్పాడు. తన వద్ద అంత మొత్తం లేదని విశ్రాంత ఉపాధ్యాయుడు చెప్పాడు. ఆయనకు ఎన్ని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయి, వాటిలో ఎంత నిల్వ ఉందో అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని బ్యాంక్‌కు వెళ్లి తాకట్టు పెట్టి డబ్బు జమ చేయాలని చెప్పారు. ఇదంతా నిజమేనని నమ్మిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఈనెల 18వ తేదీన బంగారు ఆభరణాలను తనకు ఖాతా ఉన్న కెనరా బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.13.50 లక్షలు తీసుకున్నారు. ఈ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు ఇచ్చిన ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ పేరుతో ఉన్న ఖాతాలో జమ చేశారు. డబ్బు జమ చేసే ముందు బ్యాంక్ సిబ్బంది ఈ డబ్బంతా ఎవరికి పంపుతున్నారని ప్రశ్నించారు. అమెరికాలో తన కుమారుల విద్య కోసం పంపుతున్నానని చెప్పారు. బ్యాంక్ సిబ్బంది అడిగితే ఈవిధంగా జవాబు చెప్పాలని సైబర్ నేరగాళ్లు ముందే ఆయనకు ట్రైనింగ్ ఇచ్చారు. 19వ తేదీన ఫోన్‌చేసి మిగిలిన డబ్బు పంపాలని డిమాండ్ చేశారు. ఎంత ఉంటే అంత జమ చేయాలని చెప్పడంతో ఆయన రూ.5 లక్షలు అప్పుచేసి సైబర్ నేరగాళ్లు ఇచ్చిన ఖాతాలో జమ చేశారు. తర్వాత అనుమానం వచ్చిన విశ్రాంతి ఉపాధ్యాయుడు గురువారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు.

కన్నీటి లంక

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు, ఉపాధ్యాయులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

కొట్టుకుపోతున్న యడ్లంక కాజ్‌వే



అవనిగడ్డకు అత్యంత సమీపంలోని యడ్లంక కాజ్‌వే వరదలు వచ్చిన ప్రతిసారీ కొట్టుకుపోతోంది. గతనెలలో కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో కొట్టుకుపోయింది. ప్రస్తుతం వస్తున్న వరద నీటి కారణంగా కాజ్‌వే మరింత కోతకు గుర వుతోంది. ఈ కాజ్‌వే బదులు వంతెన నిర్మించాలని యడ్లంకవాసులు కోరుతున్నా ప్రయోజనం లేదు. దీంతోపాటు తోట్లవల్లూరు మండలం పాముల్లంక వద్ద వంతెన నిర్మిస్తామని పాలకులు చెబుతున్నా, కొన్నేళ్లుగా ఈ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.

5 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 6 గంటలకు 5.08 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. 8 నుంచి 10 లక్షల క్యూసెక్కుల మేర వరద నీరు వదిలితే సురక్షిత ప్రాంతాలకు వస్తామని లంక గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

పునర్విభజన మాటేంటి?

(5వ పేజీ తరువాయి)

ప్రజా, స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా సరే తమ ప్రతిపాదనను లిఖితపూర్వకంగా అందజేయవచ్చు. వీటిపై అదేరోజు మంత్రుల బృందం ప్రాథమికంగా చర్చిస్తుంది. మెజారిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి మంత్రుల బృందంలో చర్చించాక ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు.

ప్రధాన సమస్యలివీ..

వైసీపీ హయాంలో ఉమ్మడి కృష్ణాజిల్లాను రెండుగా విభజించారు. కొత్తగా ఎన్టీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే, ఎన్టీఆర్ జిల్లాను అసమగ్రంగా ఏర్పాటు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి గన్నవరం, పెనమలూరు మండలాలను తీసుకురావాలని, కృష్ణాజిల్లా పరిధిలోకి కైకలూరు, ముదినేపల్లిని తీసుకురావాలన్న డిమాండ్ ఉంది. అలాగే, నూజివీడు, ఆగిరిపల్లి మండలాలను ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో కలపాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి. వీటిని కిందటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. విజయవాడ గ్రేటర్ విలీన గ్రామాలను కూడా కృష్ణాజిల్లా పరిధిలోకి తీసుకొచ్చింది. తాజాగా విజయవాడను 81 గ్రామాలతో గ్రేటర్ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై కసరత్తులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రుల బృంద పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల ప్రాతిపదికనే మండలాలను చేర్చాలా? వద్దా? అనే నిర్ణయాలను మంత్రుల బృందం తీసుకుంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి ఆలోచన ఏమీ లేదనే తెలుస్తోంది.

పేర్ల మార్పు సంగతేంటి?

జిల్లాల పేర్లను పరస్పరం మార్చాలంటూ మంత్రుల బృందంలో ఒకరైన సత్యకుమార్ యాదవ్‌కు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇప్పటికే ప్రతిపాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు కృష్ణా జిల్లాలో ఉంది కాబట్టి.. ఆ జిల్లాకే ఎన్టీఆర్ పేరు సముచితమని, అలాగే, ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానది ఎక్కువ దూరం ప్రవహిస్తుంది కాబట్టి కృష్ణాజిల్లా పేరు పెట్టాలని వెంకట్రావు సూచించారు.

నదీపాతం నుంచి ఎడ్లంక గ్రామాన్ని పరిరక్షించండి

- హోంమంత్రి అనితకు బొబ్బా విజ్ఞప్తి



హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదల కారణంగా నదీపాతానికి గురవుతూ కనుమరుగయ్యే పరిస్థితి ఉన్న పాత ఎడ్లంక గ్రామాన్ని పరిరక్షించాలని టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ రాష్ట్ర హోం, విపత్తు నివారణ నిర్వాహక శాఖ మంత్రి వంగలపూడి అనితను కోరారు. గురువారం సాయంత్రం అమరావతిలో మంత్రి అనితను కలిసిన గోవర్ధన్ ఇటీవల తెలుగుదేశం బృందం గ్రామంలో పర్యటించి అక్కడి పరిస్థితులను ఫొటో, వీడియో తీయించి గ్రామం ఎదుర్కొంటున్న తీవ్రమైన కోత సమస్య గురించి మంత్రి అనితకు వివరించారు. ఇప్పటికే గ్రామంలో పదుల సంఖ్యలో ఇళ్లు నదిలో కలిసిపోయాయని, వందలాది ఎకరాల భూమి నదీపాతానికి గురైందని వివరిస్తూ పత్రికల్లో కథనాలను హోంమంత్రికి సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా తమ గ్రామసమస్యను పరిష్కరించాలని అధికారులను కలసి కోరుతున్నామని, ఈ ఏడాది కోత సమస్య అత్యంత తీవ్రంగా ఉందని, కేవలం పది రోజుల వ్యవధిలోనే ఎడ్లంక గ్రామం చుట్టూ పది మీటర్ల మేర భూమి నదిలో కలిసిపోయిందని, ఈ విషయాన్ని అధికారులు స్వయంగా పరిశీలించారని గోవర్ధన్ తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ఎడ్లంక గ్రామం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వివరిస్తూ రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు శాశ్వత పరిష్కారం కోసం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోవర్ధన్ కోరారు. తాము చెప్పిన సమస్యపై మంత్రి అనిత సానుకూలంగా స్పందించారని గోవర్ధన్ వివరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525	

వైభవంగా గంగానమ్మ జాతర

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకులపాడులో గంగానమ్మతల్లి వార్షిక మహోత్సవం(జాతర) గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గంగానమ్మతల్లికి మహిళలు పొంగళ్ల సమర్పించారు. రైతులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు వీరపనేని రాజేశ్వరరావు, కామినేని శ్రీహరిరావు, చిటికనేని వెంకప్రసాద్, జాస్తి రంగారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులే పాత్రికేయులు

-ఎమ్మెల్యే బోడె ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసి వాటి పరిష్కారానికి నిరంతరం కృషిచేసే పాత్రికేయులు వారధుల వంటి వారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గురువారం పోరంకిలో ప్రెస్ క్లబ్‌ను ప్రారంభిస్తూ ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, పోలీసు శాఖ అధికారులు, సమాజంలో వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులను సమన్వయం చేసుకుంటూ తమదైన స్థాయిలో ప్రజలకు సేవ చేస్తూ తమ ఉనికిని చాటుకుంటున్న పాత్రికేయుల సేవలు సదా అభినందనీయం అన్నారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటు చయడంలో కీలక పాత్ర వహించిన దిలీప్, లంకా సత్యవరప్రసాద్‌లను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, తాతపూడి గణేష్, ముప్పా రాజా, పోలీసు శాఖ అధికారులు వెంకటరమణ, వెంకటనారాయణ, మురళీకృష్ణ, సందీప్, వైసీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

(ఉంగుటూరు, ఆంధ్రజ్యోతి)

సీజనల్‌వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. గ్రామంలో జరిపిన ఫీవర్ సర్వేలో నమోదైన మూడు సాధారణ జ్వరాల కేసులను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆరోగ్యసిబ్బందితో కలిసి నేరుగా జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నాగమల్లేశ్వరరావు తెలిపారు. మురుగునీరు నిల్వవుండకుండా, చెత్తచెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంటా అప్పారావు, జూనియర్ అసిస్టెంటు జి.శ్రీనివాసరావు, శానిటేషన్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.


బ్లీచింగ్ చల్లే పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎస్ నాగమల్లేశ్వరరావు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- జేఎన్‌టీయూ కాకినాడ మాజీ వైస్‌చాన్సలర్ మురళీకృష్ణ

కానూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంజనీరింగ్ జీవన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్ టీయూ కాకినాడ మాజీ వైస్‌చాన్సలర్, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యాంపస్ టూ కెరీర్, లైఫ్ స్కిల్స్ అనే అంశంపై ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంజనీరింగ్ లైఫ్‌స్కిల్స్‌ను ఏవిధంగా సాధించాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జేఎన్‌టీయూ కాకినాడ మాజీ వైస్‌చాన్సలర్ మురళీకృష్ణ

సంప్రదాయంగా వినాయకచవితి నిర్వహించాలి

- డీఎస్పీ శ్రీనివాసరావు
- డీజేలు నిషేధం
- సీసీ కెమెరాలు తప్పనిసరి


మాట్లాడుతున్న గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ సత్యన్నారాయణ

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావం పెంపొందేలా సంప్రదాయంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు నిర్వాహకులకు సూచించారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో వీరవల్లి, హనుమాన్‌జంక్షన్, ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. గణపతి విగ్రహాలను పర్యావరణ హితంగా ఏర్పాటు చేయాలన్నారు. మండపం వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే అనుమతి ఇవ్వటం కుదరదన్నారు.చిన్న పిల్లలు, వృద్ధులు ఆరోగ్యం దృష్ట్యా భారీ శబ్దాలతో కూడిన డీజేలను నిషేధించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ సత్యన్నారాయణ, హనుమాన్‌జంక్షన్ ఎస్సై సురేష్, వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, ఆత్కూరు ఎస్సై సురేష్‌కుమార్, ట్రైనీ ఎస్సై ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గన్నవరం : వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని గన్న వరం సీఐ బీవీ శివప్రసాద్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లా డుతూ విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహం 5 అడుగులు ఎత్తు మించి ఉండ కూడదన్నారు. ఊరేగింపు తేదీ ముందుగా చెప్పాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవ రాత్రుల ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ సూచించారు.





175 మందికి కంటి పరీక్షలు

గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగ మల్లేశ్వరరావు అన్నారు. ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురు కుల పాఠశాలలో 175మంది విద్యా ర్థులకు గురువారం ఆప్తమాలజిస్ట్ కొండలరావు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 135 మందికి కళ్ళజోళ్లు అవసరమని నిర్ధారించారు. ఏఎన్‌ఎం డి.జ్యోతి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

'వికాస్'లో రక్తదాన శిబిరం

విజయవాడ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కళాశాల జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో కళాశాల కార్యదర్శి ఎన్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ పి.ఎస్. శ్రీనివాస్ రక్తదానం వలన జరిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో 88 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీలు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధన్‌లాల్, జి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేద ప్రజల వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తూ సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా 2విడతల్లో 26 మంది లబ్ధిదారులకు రూ. 15,65,000 చెక్కులు గురువారం అందజేశారు. జంప వీర శ్రీనివాసరావు, బిర్రు ప్రతాపరెడ్డి, మునిరెడ్డి, ధనుంజయ్ యాదవ్, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, కౌన్సిలర్లు పలియాల శ్రీనివాస్, పద్మావతి , సలోమి సంతోషి పాల్గొన్నారు.


విశ్వజనని సేవారత్న అవార్డు అందుకున్న బొకినాల విజయ రత్న చార్య

'బొకినాల'కు విశ్వజనని సేవారత్న అవార్డు ప్రదానం

కంకిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బొకినాల విజయరత్న చార్య చేస్తున్న సేవలను గుర్తించి విశ్వజనని ఫౌండేషన్ గురువారం విశ్వజనని సేవా రత్న పురస్కారంతో సత్కరించింది. విశ్వజనని మూడో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో డాక్టర్ నందమూరి తారకరామావు కళామందిరంలో గురువారం పురస్కారం అందజేశారు. విశ్వజనని ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బొగ్గాదపు బ్రహ్మానందం నుంచి ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని బొకినాల విజయ రత్నచార్య అన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలను చేసే వారిని గుర్తించి ఈ విధంగా సత్కరించటం హర్షనీయమన్నారు.

కమ్మిలి సూర్యనారాయణమూర్తికి ...

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సూర్య మెడికల్స్ నిర్వాహకుడు కమ్మిలి సూర్యనారాయణమూర్తికి విభిన్న సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు విశ్వజనని ఫౌండేషన్ ఉత్తమ సేవా రత్న అవార్డు ప్రదానం చేసింది. బుధవారం హైదరాబాద్‌లో సంస్థ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం అవార్డు అంజేశారు. కరోనా సమయంలో పేదలకు ఆహారం పంపిణీ, రోగులకు మందులు, నిత్యావసరాలు పంపిణీ కార్యక్రమాలు సూర్యనారాయణ నిర్వహించారు.

గండిగుంట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ దండమూడి వెంకట నాగేశ్వరరావు

ఉయ్యూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ గురువారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా దండమూడి వెంకటనాగేశ్వరరావు, డైరెక్టర్లుగా మరీదు వెంకటేశ్వరరావు, శీలం లీలావతిలతో పీఏసీఎస్ ఇంచార్జి కార్యదర్శి వి.స్వర్ణలత ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందేలా చూస్తానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొండాప్రవీణ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల వెంకట కుటుంబరావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి వ సంతకుమార్, ఉయ్యూరు నీటి సంఘం అధ్యక్షుడు నాదెళ్ల యుగంధర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ


విచారిస్తున్న జిల్లా అంబుడ్స్‌మెన్ కె.వి.శ్రీనివాసరావు, ఏపీఏ అశోక్‌కుమార్

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరులో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుతో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. బొమ్ములూరు పంచాయతీ ఆవరణలో జిల్లా అంబుడ్స్‌మెన్ కె.వి.శ్రీనివాసరావు విచారించారు. ఉపాధి పనులకు హాజరుకాని వారికి మస్తర్లు వేసి వారికి సగం వేతనం చెల్లించి మిగిలిన మొత్తాన్ని తీసుకున్నట్టు కత్తుల స్వర్ణ అనే మహిళతో పాటు కాకి వెంకయ్య కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు అధికారి తెలిపారు. ఆరోపణలపై ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేష్‌ను వివరణ కోరామని, అతను ఇచ్చిన వివరాల అధారంగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. విచారణలో ఏపీవో అశోక్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. అయితే కాకి వెంకటేష్ ఫీల్డ్‌అసిస్టెంటుగా గత నెలలో ఉద్యోగానికి రాజీనామా చేశారు.

395 మందికి వైద్య పరీక్షలు

కానూరు, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న ఉచిత మెగా వైద్య శిబిరం గురువారంతో ముగిసింది. సుమారు 395 మంది వర్సిటీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ప్యూర్ విజన్ ఐ లేజర్ సెంటర్, పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్, ఆపిల్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. దీనిలో దంత, కంటి, కార్డియాలజీ తదితర పరీక్షలు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సుష్మాచౌదరి, కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.శివరాంప్రసాద్ అధికారులు పాల్గొన్నారు. వీసీ వెంకటేశ్వరరావు, వీసీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ పర్యవేక్షించారు.

డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి చివరి తేదీ 26

ఉయ్యూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యాసంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 26 చివరి తేదీగా ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ కోస వచ్చే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849244585, 9701463015లో సంప్రదించాలన్నారు.


పొట్టిపాడు పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్ అట్లూరి నానికి నియామక పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

- పొట్టిపాడు పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్ అట్లూరి

ఉంగుటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తూ వారి సహకారంతో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పొట్టిపాడు పీఏసీఎస్ నూతన చైర్మన్ అట్లూరి జోషి మధు(నాని) అన్నారు. పొట్టిపాడు పీఏసీఎస్ నూతన పాలకవర్గం(త్రిసభ్యకమిటీ)ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరిగింది. టీడీపీ గన్నవరం నియోజకవర్గ నాయకుడు కాసన్నేని రాజా నూతన పాలకవర్గానికి నియామక పత్రాలు అందజేశారు.

చైర్మన్‌తోపాటు సభ్యులు నిమ్మకూరి మాణిక్యాలరావు, చొప్పర శ్రీరామతులసి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించడం ద్వారా వ్యవసాయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సొసైటీ సీఈవో షేక్ కాలీషా, సర్పంచ్ కత్తుల జ్యోతి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గులిపల్లి సందీప్, ఈసరి రవికుమార్, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.


గేట్లు బిగించకుండా అసంపూర్తిగా నిలిచిపోయిన పోలంపల్లి ఆనకట్ట

పాపం.. పోలంపల్లి!

- కొత్త ఆనకట్టకు రాజకీయ గ్రహణం
- రెండు దశాబ్దాలుగా అందుబాటులోకి రాని వైనం
- కాంట్రాక్టర్ల మధ్య వివాదం, నేటికీ పరిష్కారం కాని సమస్య
- 20 ఏళ్లుగా రైతులకు శాపం
- ప్రాజెక్టు వద్ద తుప్పుపట్టిన గేట్లు

ఖానాలు నిర్మించినా గేట్లు బిగించలేదు! ఎంతో విలువైన సామగ్రి తుప్పుపట్టిపోతోంది! రెండు దశాబ్దాలు గడుస్తున్నా పోలంపల్లి కొత్త ఆనకట్ట అందుబాటులోకి రాలేని దౌర్భాగ్య పరిస్థితి. వత్సవాయి మండలం మునేటిపై తలపెట్టిన పోలంపల్లి కొత్త ఆనకట్ట నిర్మాణం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా పడకేసింది. ఈ పాపానికి రైతులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కొత్త ఆనకట్టకు శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. సివిల్ పనులు (స్ట్రక్చర్ నిర్మాణం) దాదాపుగా పూర్తి కాగా, మెకానికల్ పనుల ఊసే లేదు. ఖానాలు నిర్మించినప్పటికీ వివాదం వల్ల గేట్లు బిగించలేదు. ఎంతో విలువైన గేట్ల సామగ్రి తుప్పుపట్టి పనికి రాకుండా పోతోంది. ఏయేటికాయేడు సాగునీరందక ఇబ్బందులు పడుతున్న ఆయకట్టు రైతులు తగిన మూల్యం చెల్లిస్తున్నప్పటికీ అసంపూర్తిగా నిలిచిన కొత్త ఆనకట్ట నిర్మాణంలో ఎలాంటి కదలిక ఉండటం లేదు. - ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మునేటి ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరందించాలన్న లక్ష్యంతో కట్టల ఎత్తు పెంచి, పాత ఆనకట్టను పునర్నిర్మించాలని ముందు నిర్ణయించారు. రాజీవ్ పల్లెబాటలో భాగంగా 2004 జూలై 4న అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి పునర్నిర్మాణ ఆనకట్ట పనులకు శంకుస్థాపన చేశారు. పునర్నిర్మాణం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, కొద్దికాలం తర్వాత మళ్లీ ఇబ్బందులు తప్పవని రైతులు అభిప్రాయం వ్యక్తం చేయటంతో అప్పటి జగ్గయ్యపేట శాసన సభ్యుడు సామినేని ఉదయభాను సీఎం దృష్టికి తీసుకువెళ్లి రూ.36 కోట్లతో రోడ్డు కమ్ కొత్త ఆనకట్టను మంజూరు చేయించారు. సివిల్ పనులను జేకే కన్‌స్ట్రక్షన్ సంస్థకు, మెకానికల్ పనులను స్వప్న ఏజెన్సీస్‌కు అప్పగించారు. పాత ఆనకట్టకు 150 మీటర్ల దిగువన 2006 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. అగ్రిమెంట్ ప్రకారం 18 నెలల్లో పూర్తి కావాల్సిన నిర్మాణం నేటికి పూర్తి కాలేదు. పలు కారణాలతో నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆనకట్ట సివిల్ పనులు మాత్రం దాదాపుగా పూర్తయ్యాయి. రోడ్డు నిర్మాణం కూడా దాదాపుగా పూర్తయింది. మునేటిలో మొత్తం 19 ఖానాలు నిర్మించారు. మెకానికల్ పనులకు సంబంధించి ఖానాలకు గేట్లు అమర్చాల్సి ఉంది. అప్పట్లో సివిల్, మెకానికల్ కాంట్రాక్టర్ల మధ్య వివాదం ఏర్పడింది. కొన్ని ఖానాల వద్ద అదనంగా వేసిన కాంక్రీట్ తొలగించాలని, తగ్గిన చోట కాంక్రీట్ వేయాలని లేకుంటే గేట్లు అమర్చటానికి వీలు పడదని మెకానికల్ కాంట్రాక్టర్ చెప్పారు. గేట్లు బిగించేందుకు అనువుగా కాంక్రీట్ సరిచేసేందుకు తొలుత అంగీకరించిన సివిల్ కాంట్రాక్టరు తర్వాత తొలగించలేదంటున్నారు. దీంతో గేట్లు బిగించకపోవటంతో ఆనకట్ట నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గేట్ల సామగ్రి అంతా నిర్మాణ స్థలం వద్దనే పడి ఉంది. ఏళ్ల తరబడి వానకు తడుస్తూ, ఎండకు ఎండుతుండటంతో ఈ సామగ్రి అంతా తుప్పుపట్టి దెబ్బతింది. ఆనకట్ట నిర్మాణ పనులు నిలిచిపోయి దశాబ్దం పైబడినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పాలకులలోనూ కదలిక లేదు. ఆనకట్ట నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో అప్పటి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విజయవాడలో ధర్నా చేశారు.


పూర్తైన రోడ్ కమ్ ఆనకట్ట స్ట్రక్చర్


తుప్పు పట్టి పాడైపోతున్న గేట్ల సామగ్రి

మట్టికట్ట గండి కూడా పూడ్చలేదు

కొత్త ఆనకట్టకు ఖమ్మం జిల్లా పెద్ద మండవ గ్రామం వైపు 375 మీటర్ల పొడవున 9 మీటర్ల ఎత్తున మట్టికట్ట ఏర్పాటు చేశారు. 2012లో మునేటికి వచ్చిన వరదకు మట్టికట్ట కోసుకుపోయింది. 150 మీటర్ల పొడవున భారీ గండి పడింది. పంట భూములు కూడా కోసుకుపోయాయి. తర్వాత వచ్చిన వరదలకు గండి ఇంకా పెరిగింది. అదిగో ఇదిగో అంటున్నారు తప్పితే ఈ గండిని కూడా ఇప్పటి వరకు పూడ్చలేదు.

మొక్కలకు సెలైనా!

- ఆశ్చర్యపోయిన కేంద్ర పర్యావరణ అటవీ శాఖ కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్
- వేసవిలో పూయాల్సిన రేల చెట్లకు పూలు ఇప్పుడెలా పూస్తున్నాయంటూ ప్రశ్న
- ఏడీసీఎల్ ఎండీ లక్ష్మీ పార్థసారథి సమాధానానికి అధికారుల బృందం కితాబు
- రాజధానిలో పచ్చదనం పరిశీలించిన గార్గ్ బృందం
- అమరావతిలో పూలమొక్కల నిర్వహణపై పూర్తి సంతృప్తి


రాజధానిలో పూల అందాల సోయగాలు.. గార్గ్‌ను కట్టిపడేసిన పూల చెట్లు ఇవే


ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, సీఆర్‌డీఏ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అధికారులతో సమావేశంలో కేంద్ర పర్యావరణ అటవీ కార్యదర్శి అమన్ దీప్ గార్గ్ బృందం

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించే దిశగా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) చేపట్టిన చర్యలు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్‌సీసీ) అధికారులను మెప్పించాయి. రాజధాని రోడ్ల వెంబడి నాటిన గ్రీన్ బెల్టులు, శాఖమూరులో అభివృద్ధి చేస్తున్న అత్యంత భారీ జలాశయంతో కూడిన పార్కులు చూసిన అధికారుల బృందం ఏడీసీఎల్ అధికారులను అభినందించకుండా ఉండలేకపోయారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ అదనపు కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్ బృందం గురువారం రాజధాని అమరావతిలో పర్యావరణం, పచ్చదనం అంశాలను పరిశీలించటానికి వచ్చింది. మధ్యాహ్నం ఉండవల్లిలో నది నీటి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాన్ని, ఫ్లడ్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అలాగే ఎల్‌పీఎస్ జోన్‌లో ఎల్‌అండ్‌టీ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌కు సంబంధించి ఎన్‌సీసీ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించింది. ప్రధానంగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు రూ.50కోట్ల వ్యయంతో చేపడుతున్న 38 రోడ్ల వెంబడి గ్రీనరీ పనులను పరిశీలించారు. వేసవి కాకపోయిన రేల చెట్లు పువ్వులు పూయటం చూసి సెక్రటరీ గార్గ్ ఆశ్చర్యపోయారు. పూలచెట్లకు సెలైన్ పెడుతున్నామని, ఈ ప్రక్రియ ద్వారా పోషకాలను అందిస్తున్నామని అందుకనే సీజన్ కాకపోయినా పూలు పూచాయని ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి వివరించడంతో ఆయన సెలైన్ పెడుతున్నారా అంటూ ఆశ్చర్యపోయారు. మొక్కలను సంరక్షణకు డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందులను చల్లిస్తున్నామని సీఎండీ చెప్పటంతో గార్గ్ ఆశ్చర్యపోయారు. నందనవనాలను తలపించేలా అభివృద్ధి పరిచిన గ్రీనరీపై గార్గ్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం కొండవీడు వాగు నుంచి వచ్చే నీరంతా శాఖమూరులోని అతి పెద్ద రిజర్వాయర్‌లో కలుస్తుంది. దీని చుట్టూ 300 ఎకరాల్లో ఏడీసీఎల్ అత్యంత భారీ ఉద్యానవనం ఏర్పాటు చేస్తోంది. ఈ ఉద్యానవనాన్ని గార్గ్ బృందం పరిశీలించింది. తర్వాత చెట్లను ఒకచోట నుంచి సజీవంగా తీసి మరోచోట నాటే ప్రక్రియను పరిశీలిచారు. అనంతరం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ అదనపు కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్ ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ సూర్యసాయి చంద్ తదితర ఉన్నతాధికారులతో గ్రీన్ ట్రిబ్యునల్ ఫిర్యాదులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

తోట నరసయ్య చిత్రాలు కావివి..!

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రముఖ దేశ నేతల చిత్రాలు అందరికీ స్ఫూర్తినిస్తున్నాయి. స్వాతంత్య్ర సమరయోధులు లాలాలజపతి రాయ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, గోపాలకృష్ణ గోఖలే, గౌతు లచ్చన్న, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య, స్వాతంత్య్ర సమరయోధురాలు సరోజిని నాయుడు వంటి ప్రముఖుల చిత్రాలను ప్రదర్శించారు. రోజూ బస్టాండ్‌లో బస్సులు ఎక్కుతున్న విద్యావంతులు, విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఈ చిత్రాలను చూసి వాటివద్ద సెల్ఫీలు దిగుతున్నారు. ఈ చిత్రాలు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. అయితే జెండా వీరుడు తోట నరసయ్య చిత్రానికి మారుగా దక్షిణ భారతదేశంలో చలన చిత్ర పరిశ్రమకు ఆద్యుడైన రఘుపతి వెంకయ్య చిత్రాలను 1,2వ నెంబరు ప్లాట్‌ఫారాల్లో ప్రదర్శించారు. రఘుపతి వెంకయ్య చిత్రం కింద తోట నరసయ్య పేరును రాశారు. ఈ చిత్రం పేరును మార్చాల్సిన అవసరం ఉంది. ఏదైనా ఒక ప్లాట్‌ఫారంలో రఘుపతి వెంకయ్య చిత్రానికి మారుగా జెండా వీరుడు తోట నరసయ్య చిత్రాన్ని ప్రదర్శించడం సముచితం.

రఘుపతి వెంకయ్య చిత్రాలకు నరసయ్య పేరు



మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో 3వ నెంబర్ ప్లాట్ ఫారంలో ఉంచిన రఘుపతి వెంకయ్య చిత్రం

రోగుల సహాయకులపై దురుసు ప్రవర్తన

- కొట్టేందుకు వెనుకాడని సెక్యూరిటీ సిబ్బంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రోగులు, సహాయకులు
- పట్టపగలు లాఠీలతో బెదిరిస్తున్నారని ఆగ్రహం


రోగి సహాయకుడిపై చేయిచేసుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు సహాయసహకారాలు అందించడంతో పాటు దొంగతనాలు, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు వీరిని నియమిస్తారు. వీరు రోగులకు సహకరించాల్సింది పోయి వారి సహాయకులపై దాడులు తెగబడుతున్నారు. ఇటీవల పాత జీజీహెచ్‌కు వచ్చిన ఓ రోగి సహాయకుడిపై సిబ్బంది దాడికి యత్నించడం సంచలనంగా మారింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

పాత జీజీహెచ్ ఆసుపత్రికి బాలు అనే వ్యక్తి తన భార్య డెలివరీకి ఆసుపత్రిలో చేర్పించాడు. అప్పటి నుంచి పార్కింగ్ స్థలం వద్దే ఉంటున్నాడు. 4 రోజులుగా ఆ వ్యక్తి ఆసుపత్రి బయట ఉంటూ తాగి వచ్చి అల్లరి చేస్తున్నాడని ఆరోపిస్తూ సిబ్బంది ఆ వ్యక్తిని బయటకు వెళ్లమంటే వెళ్లలేదనే నెపంతో కాలర్ పట్టుకుని ఏకంగా ఆసుపత్రి బయటకు నెట్టేయడానికి యత్నించారు. దీంతో ఆ వ్యక్తి సిబ్బందిపైకి ఎదురుతిరగగా మరో సెక్యూరిటీ రావడంతో ఇద్దరూ కలిసి అతడిని కొట్టారు. దీంతో ఓ వ్యక్తి సిబ్బందిని అడగగా న్యూసెన్స్ చేస్తున్నాడని బదులిచ్చారు. కొట్టే అధికారం ఎవరిచ్చారని అక్కడున్నవారు గట్టిగా అడగడంతో మాట్లాడకుండా బాలు అనే వ్యక్తిని విడిచిపెట్టారు. ఈ తతంగాన్ని చూస్తున్న రోగుల సహాయకులు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా ఇదే తరహాలో ఓ ఘటన జరిగినట్టు ఆసుపత్రికి వచ్చిన రోగులు సహాయకులు చెప్పుకొచ్చారు. పాత జీజీహెచ్‌లో గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లల విభాగాలు ఉండడంతో అక్కడ సిబ్బంది పురుష సహాయకులను ఆసుపత్రి లోపలికి పంపించేందుకు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది రోగులకు సహాయకులుగా వారి భర్తలే వస్తుండడం, వారిని లోపలికి పంపేందుకు సిబ్బంది నిరాకరించడంతో రోగులకు సమయానికి ఆహారం, ఇతర వస్తువులు అందడం లేదని వాపోతున్నారు. సెక్యూరిటీ పనిచేసే వారు పోలీసుల మాదిరి కర్రలతో ఎందుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయంలో లాఠీలు పట్టుకున్నా పర్వాలేదు పగటి పూట ఎందుకంటూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఖననం చేసిన 12 రోజులకు పోస్టుమార్టం

- కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు


మృతుడు లక్ష్మణ్‌కుమార్ (ఫైల్)

గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన 12 రోజుల తరువాత ఓ వ్యక్తికి గురువారం పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన గన్నవరం మండలం చిక్కవరం శివారు చింతగుంటలో జరిగింది. సీఐ బీవీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చింతగుంటకు చెందిన డోలా లక్ష్మణ్‌కుమార్ (35) 14ఏళ్ల క్రితం జక్కంపూడికి చెందిన బిందు పావనిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికిద్దరు కుమార్తెలు. గ్రామంలోనే ఉంటుండగా 4 నెలల క్రితం కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీ 3వ రోడ్డులో అద్దెకు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న గుండెపోటుతో మృతి చెందినట్టు బిందు పావని లక్ష్మణ్‌కుమార్ అన్న కొడుకైన సూర్యకిరణ్‌కి ఫోన్ చేసింది. వెంటనే అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామమైన చింతగుంట తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. తరువాత లక్ష్మణ్‌కుమార్ మృతి గురించి తల్లిదండ్రులు విచారిస్తుండగా మృతి చెందిన రోజు అదే గ్రామానికి చెందిన దేవరపల్లి ప్రదీప్ అక్కడ ఉన్నట్టు తెలిసింది. బిందు పావని, ప్రదీప్‌పై అనుమానం ఉందని తండ్రి డోలా ఏసుపాదం ఈ నెల 18న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కుమారుడు మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం చేసి మృతిపై ఉన్న సందేహాన్ని తొలగించాలని కోరారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఫిర్యాదుపై ఈ మృతదేహాన్ని బయటకి తీసి తహసీల్దారు కేవీ శివయ్య సమక్షంలో ఇద్దరు డాక్టర్లు పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదిక తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- వివిధ శాఖల పనితీరుపై కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం గృహనిర్మాణం, స్వచ్ఛాంధ్ర, దివ్యాంగుల పింఛనుదారుల అప్పీళ్లు, ఆధార్ బయోమెట్రిక్, స్వామిత్వా సర్వే వంటి అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10,007 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అయితే కేవలం 3,966 గృహాల నిర్మాణాలను మాత్రమే చేయగా, మిగిలిన 6,041 గృహాల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జూలై, ఆగస్టులో 2,498 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని గతంలో జరిగిన సమావేశాల్లో లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 363 గృహాలు మాత్రమే పూర్తి చేయడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలను పూర్తిచేయడంలో ఇబ్బందులు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. గృహనిర్మాణాలు పూర్తి చేసిన వారికి దశలవారీగా త్వరగా బిల్లులు చేయాలని ఆదేశించారు. కేంద్రప్రభుత్వం ఏడాదిపాటు గడువు పొడిగించిందని, 2026 మార్చి 31లోగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

దివ్యాంగుల అప్పీళ్లను త్వరగా పరిశీలించాలి

జిల్లాలో 4,332 మంది దివ్యాంగులకు సంబంధించి 40 శాతంలోపు వైకల్యం ఉన్నవారికి పింఛన్లను నిలిపివేస్తామని నోటీసులు జారీచేశామని, వాస్తవంగా వైకల్యంతో ఇబ్బందులు పడేవారు మీకోసంలో, సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రితోపాటు, గుడివాడ, అవనిగడ్డ ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి ఈనెల 25లోపు దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ చేయించాలి

అన్ని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ చేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఐదు నుంచి 15 ఏళ్లలోపు ఒకసారి, 15ఏళ్లు పైబడిన వారికి రెండోసారి ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయించాలన్నారు. లేకుంటే నీట్, జేఈఈ వంటి పరీక్షలకు అవకాశం లేకుండా పోతుందన్నారు. వర్షాకాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్వామిత్వా సర్వే 251 గ్రామాల్లో పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లోనూ పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణసంస్థ పీడీ ఎస్ వెంకట్రావ్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ సాయిబాబు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీపీవో జే అరుణ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతికి నచ్చేలా.. గణపతి మెచ్చేలా!

- 26న మట్టి ప్రతిమల తయారీలో ప్రపంచ రికార్డుకు సన్నద్ధం: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి చెక్ పెట్టి, పర్యావరణ హితంగా పండగలు జరుపుకొనేలా ప్రజలను జాగృతం చేసేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నామని, ఈసారి మట్టి ప్రతిమల తయారీతో ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టరేట్‌లో వివరించారు. కృత్రిమ రంగులు, రసాయనాలు, థర్మోకోల్ వంటి వాటి వినియోగంతో పర్యావరణానికి పెనుముప్పు ఏర్పడుతుందని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ హిత మార్గాలను అనుసరించాలన్నారు. యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే క్రమంలో ప్రపంచ రికార్డు నెలకొల్పామని, లాగే చవితి ఉత్సవాల్లోనూ మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగను జరుపుకునేలా ప్రోత్సహించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, విజయవాడ నగర పాలక సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈనెల 26న ఒక నగరంలో అత్యధిక సంఖ్యలో మట్టి ప్రతిమలను తయారుచేసి రికార్డు నెలకొల్పనున్నట్టు వివరించారు. వివిధ పాఠశాలలతో పాటు ఐజీఎం మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని, స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లను భాగస్వాములను చేస్తున్నట్టు వివరించారు. ప్రజలు కూడా మట్టి వినాయకులను తయారుచేసి ఫొటోలను 9154970454 నెంబరుకు వాట్సాప్ చేయాలని సూచించారు.

కోసూరులో నాలుగు దేవాలయాల్లో చోరీలు

- వెండి, బంగారు ఆభరణాలతోపాటు నగదు అపహరణ

కూచిపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి నాలుగు దేవాలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడ్డారు. వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీలు పగులకొట్టి నగదు అపహరించటం ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. ఈ సంఘటనలతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక క్షత్రియ రామాలయంలో నాలుగు వెండి కిరీటాలు, మంగళసూత్రంతోపాటు హుండీ పగులకొట్టి నగదు అపహరించారు. అలాగే స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఐదు వెండి కిరీటాలు, మంగళసూత్రం, గంగానమ్మ, వినాయకుడి గుడిలో హుండీలు పగులకొట్టి నగదు అపహరించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్థులు తెలిపారు. రూ.6 లక్షల విలువైన ఆభరణాలు అపహరించినట్లు తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించాయి. ఇటీవల పెదపూడిలో రామాలయం, సాయిబాబా ఆలయంతో పాటు పెడసనగల్లు రోడ్డులోని గణపతి ఆలయంలోనూ చోరీలు జరిగాయి. వరుస చోరీలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పామర్రు సీఐ శుభాకర్, కూచిపూడి ఎస్ఐ కేఎన్ విశ్వనాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.


రామాలయం గేటు తాళాలు పగల కొట్టిన దొంగలు




పగలకొట్టిన హుండీ, చోరీకి గురైన స్వామివారి కిరీటాలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525	



యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కూచిపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం పెదసనగల్లులో గురువారం సాయంత్రం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), మొవ్వ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వరిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణా తరగతులు నిర్వహించారు. నానో యూరియా, నానో డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువులు గురించి, వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై ఏడీఏ ఎస్.శ్యామల రైతులకు వివరించారు. ఏవో బి.సురేష్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.రాజేష్, పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్యామల



తుమ్మలపచ్చికలంక ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ సిబ్బంది

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పాములలంక, తుమ్మలపచ్చికలంక గ్రామాలను గురువారం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. నాటు పడవపై సదరు లంక గ్రామాలకు చేరిన వరద పరిస్థితిని వివరించారు. వరద ఎప్పుడు పెరుగుతుందో తెలియదని, అందుచేత సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. ఇపుడు నడుస్తున్న ఐదున్నర లక్షల క్యూసెక్కుల వరద వల్ల తమకు ఇబ్బంది లేదని, పది లక్షల క్యూసెక్కుల వరద వస్తేనే పునరావాస కేంద్రాలకు వస్తామని తుమ్మపచ్చికలంక ప్రజలు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి వివరించారు. గర్భిణులు బంధువుల ఇళ్లకు వెళ్లాలని వీఆర్‌వో నాంచారయ్య సూచించారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలోని జుజ్జవరం గ్రామ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా టీడీపీ గ్రామ సీనియర్‌నేత జోగి గంటలయ్య పదవిబాధ్యతల స్వీకారణోత్సవం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా నూతనంగా ఎంపికైన పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గంటలయ్యతోపాటు, ఇరువురు సభ్యులైన జుజ్జువరపు యోహన్, చెరుకూరి మాలతిలచేత ప్రమాణ స్వీకారం చేయించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి సేవలందించిన వారికి పదవులు వరిస్తాయన్నారు. టీడీపీలో ప్రతి కార్యకర్తకు, నాయకులకు గుర్తింపు తప్పక ఉంటోందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలు బాధ్యతతో ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా రైతాంగానికి గ్రామాల్లో చేదోడు వాదోడుగా నిలుస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభన్‌బాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పుట్లమ్మసత్రం అభివృద్ధికి తోడ్పడాలి

పామర్రు : పుట్లమ్మ సత్రం అభివృద్ధికి నూతనంగా ఎంపికైన పాలక మండలి చైర్మన్‌తోపాటు పాలక వర్గ సభ్యులు తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రులో గల పుట్లమ్మ సత్రంకు నూతనంగా ఏర్పడిన పాలక మండలి చైర్మన్ ఆరుమళ్ల గంగాభవానీతోపాటు ఇతర ఎనిమిదిమంది పాలక మండలి సభ్యులచేత స్థానిక పుట్లమ్మ సత్రం ఆవరణలో గురువారం పదవీ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే చేయించారు.

పెదపారుపూడి: పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలో ట్రాక్టర్ ర్యాలీతో పీఏసీఎస్ కమిటీ చైర్మన్ కూచిపూడి వెంకట సుబ్బారావు చౌదరి, సభ్యులు కొమ్మ వీర్రాజు, గుండేటి అర్జునరావు, వానపాములలో పీఏసీఎస్ చైర్మన్ వేములపల్లి నరసింహారావు, సభ్యులు సాయల బసవ శంకరరావు, మోచర్ల నరసింహా బాబురావు ప్రమాణస్వీకారం జరిగింది. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన త్రీమెన్ కమిటీని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మాజీ సర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, మాజీ జడ్పీటీసీ చిలకా ఆంజనేయులు, పొనుగోటి సత్యనారాయణ, గొరిపర్తి రవికుమార్ పాల్గొన్నారు.



జుజ్జవరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

రావి వీరభద్రయ్య వెటర్నరీ పాలీ క్లినిక్ సలహా సంఘం ఏర్పాటు

గుడివాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక రావి వీరభద్రయ్య వెటర్నరీ పాలీ క్లినిక్ సలహా కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఛీఫ్ కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలీ క్లినిక్ సలహా కమిటీ గౌరవ చైర్మన్‌గా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, చైర్మన్‌గా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, సభ్యులుగా గుడివాడ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్, నియోజకవర్గం నుంచి ఇద్దరు డెయిరీ ఫార్మర్లు, నియోజకవర్గం నుంచి ఒక మేక/గొర్రె పెంపకందారుడు, మున్సిపల్ ఏరియాకు చెందిన ఒక జంతు సంక్షేమ కార్యకర్త, గుడివాడ మండలం నుంచి స్వయం సహాయక గ్రూపుల నుంచి ఎస్సీ/ఎస్టీ మహిళ లైవ్ స్టాక్ పెంపకందారు, మెంబర్ కన్వీనర్‌గా గుడివాడ వెటర్నరీ పాలీ క్లినిక్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాలీ క్లినిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల రక్షణ, నిర్వహణ, మానవ వనరుల లభ్యత, ప్రభుత్వ నిబంధనల మేర నిధుల సమీకరణ వంటివి నియమించిన కమిటీ చూసుకోనుంది. నూతనంగా నియమించబడే కమిటీ మూడేళ్ల కాలవ్యవధి పనిచేయనుంది.

ర్యాగింగ్ పేరుతో ఇబ్బంది కలిగించొద్దు

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ పేరిట తోటి విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధించడం, ఇబ్బంది కలిగించవద్దని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ హెచ్చరించారు. గురువారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో గుడివాడ వన్‌టౌన్ పోలీసులు ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా "సే నో టూ డ్రగ్స్, ర్యాగింగ్" సైన్ బోర్డును ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దన్నారు. బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అనైతికమైన ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి జీవితం చాలా గొప్పదని, ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వద్దు భవిష్యత్తు ముద్దు అని, మత్తు, మాదకద్రవ్యాల సేవించిన, విక్రయిస్తున్న వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ 1972కు తెలపాలన్నారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య మాట్లాడుతూ ర్యాగింగ్ కళాశాలలో నిషిద్ధమని, ప్రతి విద్యార్థీ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కళాశాలలో యాంటీ కమిటీ విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు పోలీసు శాఖ వారితో అవగాహన సదస్సులను తరచూ ఏర్పాటుచేస్తూ క్యాంపస్‌లో "నో-ర్యాగింగ్", "సే నో టూ డ్రగ్స్" సైన్ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులో వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల నిషేధం గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

మినుముల చోరీ .. దొంగల అరెస్టు

పామర్రు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): పామర్రులోని చల్లపల్లి రోడ్డులో గల ఓ అపరాల వ్యాపారి దుకాణంలో ఇటీవల జరిగిన చోరీకి పాల్పడిన దొంగలను పామర్రు పోలీసులు అరెస్టు చేశారు. చోరీకీ సంబంధించి పట్టుబడిన దొంగలను గురువారం మిడియా ముందు ప్రవేశ పెట్టి ఆకేసు వివరాలను విలేకరులకు సీఐ సుభాకర్ వివరించారు. ఈనెల 4న చల్లపల్లి రోడ్డున గల షణ్ముక ట్రేడర్స్ (అపరాల వ్యాపారం) సంబంధిత దుకాణ యాజమాని ఊటుకూరి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని దుండగులు తన దుకాణం తాళాలు పగలు గొట్టి లోపలికి ప్రవేశించి, లోపలగల పోట్టుతీసినమినుములు(తెల్లగుళ్ల) 50కేజీలవి 40కట్టలను దొంగిలించుకు పోయినట్టు ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు అనుసరించి పోలీసులు కేసునమోదు చేసి సాంకేతికను ఉపయోగించుకుని చోరీకేసును చేధించామన్నారు. చోరీకి పాల్పడిన వారంతా పామర్రుకు చెందిన నంబూరి శివరామకృష్ణ(34) శాఖమూరి మనోజ్ (32) యలమర్తి గోపికృష్ణ(30)అనే వారిగా గుర్తించామన్నారు. వారిని మచిలీపట్నం ఫ్లైఓవర్ వంతెన వద్ద దొంగిలించిన పొట్టుతీసిన మినుముల బస్తాలు మరో వాహనం ద్వారా తరలించేందుకు మార్పిడి చేస్తున్న తరుణంలో అదుపులోకి తీసుకుని సంబంధిత సరుకు 20 క్వీంటాళ్లతోపాటు, దొంగతనం చేసిన సరకు రవాణాకు వినియోగించిన రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. దొంగలను కోర్టుకు హజరు పరుస్తున్నట్లు చెప్పారు. ఎస్సై రాజేంద్రప్రసాద్, ట్రైనీ ఎస్సై సత్యకళ, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుభాకర్

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

● కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సుధారాణి

గుడివాడ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సుధారాణి అన్నారు. గురువారం గుడివాడ, పెదపారుపూడి, నందివాడ మండలాల వ్యవసాయ శాఖ అధికారులకు, నూతనంగా బదిలీపై వచ్చిన వీఏఏలకు వ్యవసాయశాఖ యాజమాన్య పద్ధతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుపు నివారణకు రైతులు ప్రాముఖ్యతనివ్వాలన్నారు. కలుపు మొక్కలు తక్కువ దశలో ఉన్నప్పుడు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రైతూ కలుపును అశ్రద్ధ చేస్తే పంట దిగుబడి తగ్గటమే కాకుండా పొలం పాడవుతుందని తెలిపారు. జిల్లా వనరుల కేంద్ర కో-ఆర్డినేటర్ కె.జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రతి రైతూ సమపాళ్లలోనే నీటిని ఉంచి వరి దుబ్బులు ఎక్కువగా అయ్యే విధంగా చూసుకోవాలన్నారు. నీరు ఎక్కువగా ఉంటే వరి దుబ్బులు తక్కువగా చేస్తాయని పేర్కొన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అధిక దిగుబడులు పొందటమే కాకుండా లాభాలు గడించవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాకులు కె.శ్రీనివాసరావు, గుడివాడ ఏడీఏ కవిత, ఏవోలు బోలెం అనంతలక్ష్మి, త్రినాథ ఆంజనేయరావు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

గుడివాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్నఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.6,400కోట్లు విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్.ఎఫ్.ఐ) జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతీగృహ విద్యార్థులకు మెస్ చార్జీగా రూ.3000లకు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలను కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, జీ.వో నెం.77ను రద్దు చేయాలన్నారు. కృష్ణా యూనివర్సిటీకి హాస్టల్ యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌ల సాధన కోరుతూ ఈ నెల 25వ తేదీన విద్యార్థులతో కలిసి చలో కలెక్టరేట్ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని సమరం తెలిపారు. అనంతరం ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నాగేంద్ర, కమిటీ సభ్యులు రుధీర్, కార్తీక్, బాబీ, పవన్, పాల్గొన్నారు.



ఆర్‌డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

గుడివాడ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్సై చంటిబాబు పేర్కొన్నారు. గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిసరాలను పోలీసు సిబ్బంది పరిశుభ్రం చేశారు. గురువారం ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగించి పూల మొక్కలు, కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసి వాటికి నీరు పెట్టారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

తోట్లవల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు 2024-25 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఉపాధిహామీ ఏపీఎం సురేష్ గురువారం తెలిపారు. గ్రామస్థాయిలో పనుల తనిఖీ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగిందని, తదుపరి మండలస్థాయి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరు కావాలని ఆయన కోరారు.



బొమ్ములూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రైవేట్ వైద్యులు ఉచితంగా మెడికల్ క్యాంపులు పెట్టడం వల్ల పేదవారికి మేలు జరుగుతుందని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నారు. గురువారం బొమ్ములూరులో ఉచిత వైద్యశిబిరం పెలికాన్ ఆసుపత్రి వైద్యులు రోజా ఏర్పాటు చేశారు. 100 మందికిపైగా రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

సోషల్‌మీడియా యాప్‌లపై అవగాహన తప్పనిసరి

గుడ్లవల్లేరు: విద్యార్థినులు ఇన్‌స్టాగ్రామ్,ఫేస్ బుక్‌ల వంటి యాప్‌ల్లో తమ వ్యక్తిగత సమాచారాలు ఎవరికీ షేర్‌చేయవద్దని గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ గురువారం సాయంత్రం బస్టాప్‌లో బస్‌ల కోసం వేచి ఉన్న విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలానే సైబర్ నేరగాళ్లు అరెస్టులు అనీ, కళాశాలల్లో ఫీజ్ రీయంబర్స్‌మెంట్ చేయిస్తామనికానీ, విదేశాలకు వెళ్లేందుకు రుణాలు ఇస్తామని కానీ ఫోన్‌లు చేస్తూ మీ సమాచారాలను అడుగుతుంటారని, వాటికి స్పందించవద్దని ఆయన సూచించారు. ఫేక్ కాల్స్‌ను పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన చెప్పారు.

టీడీపీ గుడ్లవల్లేరు అధ్యక్షుడిగా కొసరాజు ఏకగ్రీవం

గుడ్లవల్లేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడిగా కొసరాజు బాపయ్య చౌదరిని మరోసారి పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం సాయంత్రం గుడ్లవల్లేరు మండల టీడీపీ కార్యాలయం వెంకటరామకృష్ణా రైస్ మిల్ ప్రాంగణంలో నిర్వహించిన టీడీపీ మండల అధ్యక్ష ఎన్నికల్లో మండలంలోని 21 గ్రామాల గ్రామ పార్టీ అధ్యక్షులు అందరూ కలసి బాపయ్యచౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత టీడీపీ డోకిపర్రు అధ్యక్షుడు వీరమాచనేని శివప్రసాద్ బాపయ్యచౌదరి పేరును ప్రస్తావించగా, కౌతవరం పార్టీ అధ్యక్షుడు వీబీకేబి సుబ్బారావు(కౌతవరం బాబూరావు), టీడీపీ వడ్లమన్నాడు అధ్యక్షుడు పామర్తి సత్తిబాబు, టీడీపీ కూరాడ అధ్యక్షుడు కల్యాణపు నవాబులు బలపరిచారు. మిగిలిన గ్రామపార్టీల అధ్యక్షులందరూ బాపయ్యచౌదరికి మద్దతు తెలిపి ఆయన్ను మండల పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా రాష్ట్ర పార్టీ కార్యదర్శి సాయిన పుష్పావతి, నీటిసంఘ అధ్యక్షుడు సాయిన ప్రసాద్‌లు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వల్లభనేని బాబూరావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ కొడాలి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.



బాపయ్య చౌదరిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు



పీఏసీఎస్ సభ్యుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాగ వెంకట కృష్ణారావు

ఆర్థిక సాయం

పెదపారుపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపాడు పీఏసీఎస్ సభ్యుడు రాజబోయన నాగేశ్వరరావు మృతి చెందగా, కుటుంబ సభ్యులకు మట్టిఖర్చుల నిమిత్తం సంఘం తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ మేరకు గురువారం పీఏసీఎస్ అధ్యక్షులు కాటూరి నాగ వెంకట కృష్ణారావు, కార్యదిర్శ పి.కుమారి, సభ్యులు నాగేశ్వరరావు స్వగృహానికి వచ్చి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

చెట్టుకొమ్మలను తొలగించండి మహాప్రభో..



అంగన్వాడీ కేంద్రంపైవరకు ఉన్న తుమ్మచెట్టుకొమ్మలు

తోట్లవల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు సుగాలిపేటలోని అంగన్వాడీ కేంద్రం భవనానికి అనుకుని సీమతుమ్మచెట్టు కొమ్మలు పసి పిల్లలను, తల్లిదండ్రులను భయపెడుతోంది. అంగన్వాడీ భవనంపైకి భారీ కొమ్మలతో పెరగటంతో గాలివాన వస్తే కొమ్మలు విరిగి భవనంపై విరిగి పడతాయని భయం వేస్తోంది. తుఫానులాంటి భీకర గాలివస్తే చెట్టు కూలి అంగన్వాడీ భవపంపై పడే ప్రమాదం సైతం పొంచివుంది. ఈ చెట్టుకొమ్మల వల్ల తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలంటే భయపడుతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ చెట్టు కొమ్మలను నరికించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వినాయక పందిరికి పూజలు

గుడ్లవల్లేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న వినాయక చవితి ఉత్సవాలకు భక్తులు సిద్ధమౌతున్నారు. గురువారం గుడ్లవల్లేరులో సంతబజార్‌లోని సత్యదేవుని ఆలయం సమీపంలో గణేష్‌యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాల పనులను ప్రారంభించారు. పందిరికి రాటవేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చాపరాల రాజేశ్వరరావు, గణేష్ యూత్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

నందివాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి చలువ పందిళ్లకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరి అని నందివాడ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే సంబంధిత శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక నవరాత్రులలో ఏవైనా అసంఘటిత సంఘటనలు జరిగితే పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదేనన్నారు. సొంత స్థలాల్లో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే అట్టి స్థలానికి సంబంధించిన యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, రాత్రి 8 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు.



ఎస్సై శ్రీనివాస్

పమిడిముక్కల : పమిడిముక్కల మండల పోలీస్ స్టేషన్ పరిధి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పక నియమాలు పాటించాలని ఎస్సై బి.శ్రీను గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు నిర్వహించదలచిన వారు ముందస్తుగా కమిటీని ఏర్పాటుచేసుకుని పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.

గుడ్లవల్లేరు : మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాల నిర్వాహకులు పోలీసువారి నిబంధనలు, సూచనలు పాటించాలని ఎస్సై సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఉత్సవాలు నిర్వహించాలనే వారు పంచాయతీ వారి అనుమతి తీసుకోవాలన్నారు. ఈ మేరకు నిబంధనలను తెలిపే కరపత్రాలను ముద్రించి గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525




ఎస్పీ గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిసిన డీఎస్పీ ధర్మేంద్ర

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ధర్మేంద్ర

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా కె.ధర్మేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ ఆర్.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

గురుకులాల్లో ప్రణాళికాయుత విద్యాబోధన


మాట్లాడుతున్న గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ సురేష్‌బాబు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన గురుకులాల్లో అందిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ సురేష్‌బాబు వెల్లడించారు. పులిగడ్డ గురుకుల విద్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో గురుకుల విద్యార్థులు గణనీయమైన ప్రగతి సాధించి, ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, ప్రస్తుత పరిస్థితుల్లో నిధుల లేమీ కారణంగా శ్లాబ్ స్థానే రేకుల షెడ్లు వేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. అసంపూర్తిగా మిగిలిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయటానికి మరో రూ.72 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. గురుకుల విద్యాలయంలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం తదితర విషయాల ను సురేష్‌బాబు పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఎస్‌టి.పి.కుమార్, పీఈటీ జి.వీరకుమార్ తదిరతులు పాల్గొన్నారు.

సీఐ యువకుమార్‌కు రివార్డు


సీఐ యువకుమార్‌కు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

అవనిగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అవనిగడ్డలో ఇద్దరు బాలుర మిస్సింగ్ కేసును సమర్థవంతంగా ఛేదించి, కేవలం 12 గంటల వ్యవధిలోనే ఆచూకీ కనిపెట్టి, 24 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగించటంలో ప్రధాన భూమిక పోషించిన అవనిగడ్డ సీఐ యువకుమార్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు నగదు రివార్డుతో సత్కరించారు. అవనిగడ్డలో శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల పరిష్కారంలో సాంకేతికత వినియోగంలో సీఐ యువకుమార్ నేతృత్వంలో సర్కిల్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక చర్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నగదు పురస్కారాన్ని అందుకున్న సీఐ యువకుమార్‌కు సర్కిల్ పోలీసులు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల వినతి


ఎమ్మెల్యే కాగితకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ నేతలు

బంటుమిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు గురువారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ ఇచ్చారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన 42 రోజుల దీక్షా శిబిరానికి వచ్చి ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం మరచిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు అందిస్తా


బాధ్యతలు చేపడుతున్న పరుచూరి శ్రీనివాసరావు

మోపిదేవి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సకాలంలో రుణాలు అందించేలా కృషి చేస్తానని రావివారిపాలెం పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. పీఏసీఎస్ సభ్యులు కారుమూరి ప్రసాద్, కొలుసు శ్రీనివాసరావుతో కలిసి ఆయన బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ఏ గ్రామానికి చెందిన ఏ రైతు వచ్చినా రావివారిపాలెం పీఏసీఎస్ నుంచి సకాలంలో రుణాలు అందిస్తామన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును పీఏసీఎస్ ఉద్యోగులు, రైతులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సామినేని ఉదయభానుకు గూడూరులో సత్కారం



గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. వ్యక్తిగత పని మీద వెళుతున్న ఉదయభానుతో సంబంధం ఉండడంతో జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. జిల్లా జనసేన నాయకుడు కొరియర్ శ్రీను, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దాసరి ఉమాసాయిరామ్, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, రాసంశెట్టి దుర్గారావు, బాసంశెట్టి విజయకుమార్, యర్రపోతు అయ్యప్ప, బాకీ నాని, బాదం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దుల్హన్ పథకం అమలు చేయాలి


మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

గూడూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : ముస్లిం ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథ కం అమలు చేయాలని, మసీదులు, ఈద్గా లు, షాదీ ఖానాలు, ఖబరస్తాన్‌ల అభివృద్ధికి నిధు లు మంజూరు చేయాలని కోరుతూ ముస్లింలు గురువారం వెలగపూడిలో మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. పెడన నియోజకవర్గ మైనారిటీ నాయకుడు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎండి హమీదుల్లా, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎస్‌ఏ బేగ్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ ఎండీ రఫీ, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ హఫీజ్, గుడ్లవల్లేరు మండల నేత అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

సురక్షిత వేటకు మత్స్యకారులకు పరికరాలు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ పరిస్థితిని ముందుగానే తెలుసుకుని సురక్షి తంగా వేట చేసేందుకు ప్రభుత్వం సారంగిపాలెంలోని 40 మంది బోటు యజమానులకు పరికరాలను మంజూరు చేసింది. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ వీటిని అందజేశారు. ఈ యంత్రాల సాయంతో మత్స్యకారులు ధైర్యంగా వేటకు వెళ్లేందుకు వీలవుతుందని సత్యనారాయణ అన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ అధికారి బండి వీరాస్వామి, సాగర్ మిత్ర నవ్య , బోటు యజమానులు పీత ఏడుకొండలు, పెదసింగు సుబ్రహ్మణ్యం, కొక్కిలిగడ్డ గోపాలకృష్ణ, శేగు భార్గవ్, పెదసింగు ఏడుకొండలు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణం హామీని నెరవేర్చాలని కోరుతున్న పాత ఎడ్లంక ప్రజలు


నాగాయలంక చినకట్ట వద్ద ఇళ్లలోకి వచ్చిన వరద నీరు


కరకట్ట పనులను పరిశీలించిన టీడీపీ శ్రేణులు

ఇళ్లలోకి వరద నీరు..ప్రజల ఆందోళన

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 5 లక్షల 7 వేల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. వరద నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మరో రెండు రోజులపాటు ఇదే తరహాలో వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉండటంతో కృష్ణానది తీర గ్రామాల ప్రజలు అవసరమైన పక్షంలో సురక్షిత ప్రాంతాలకు చేరు కోవాలని విజ్ఞప్తి చేశారు. వరద ప్రవాహం పెరుగుతుం డడంతో పాత ఎడ్లంక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాత ఎడ్లంకకు వంతెన నిర్మాస్తామని చెప్పిన పాలకులు తమ హామీని నెరవేర్చకపోతే ఆందోళనలకు దిగుతామని గ్రామ ప్రజలు తెలిపారు. **నాగాయలంక :** చినకరకట్టకు ఆనుకుని ఉన్న గృహంలోకి వరద నీరు చేరింది. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నది ఒడ్డున మత్స్యకారుల భవనం వెనుక ప్లాట్ ఫారం కూడా వరద కోతకు గురౌతోందని మత్స్యకార నేతలు తెలిపారు. వరద ప్రవాహం పెరిగితే చినకరకట్ట కింద ఉన్న ప్రజలను పునరావాస కేంద్రానికి తరలిస్తామని తహసీల్దార్ తెలిపారు.

కరకట్ట పటిష్ఠం పనుల పరిశీలన

కోడూరు : కృష్ణానదికి వరద వస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది కరకట్ట రక్షణ పనులు కొనసాగుతున్నాయి. ఉల్లిపాలెం గ్రామ సమీపంలో కరకట్ట బలహీనంగా ఉన్న ప్రదేశంలో ఇరిగేషన్ అధికారులు చేపట్టిన రక్షణ పనులను మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. కోడూరు, ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి, పిట్టలంక అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద వరదనీరు ఎగువకు రాకుండా ఇసుక మూటలు వేయాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి రాజేష్, విశ్వనాథపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాంబయ్య, కాగిత ప్రసాద్, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, గోగినేని సోమశేఖరరావు పాల్గొన్నారు.

అధికార భాషా సంఘానికి ఎంవీకే పేరుపై హర్షం

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు


అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ అవనిగడ్డ, కోడూరులో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

అవనిగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మండలి వెంకట కృష్ణారావు (ఎంవీకే) అధికార భాషా సంఘంగా ఖరారు చేస్తూ మంత్రి మండలినిర్ణయం తీసుకోవటంపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. తెలుగుభాష అభ్యున్నతికి తన తండ్రి వెంకట కృష్ణారావు చేసిన సేవలకు సీఎం చంద్రబాబు నాయుడు శత జయంతి వేడుకల్లో అధికార భాషా సంఘం పేరును మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం పేరుగా ప్రకటించినట్లుగానే గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఖరారు చేస్తూ జీవో విడుదల చేయటం పట్ల ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు పేరును అధికార భాషా సంఘానికి ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకోవటం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అవనిగడ్డలోని రాజీవ్ గాంధీ సెంటర్‌లోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి టీడీపీ, జనసేన నేతలు పూలమాలలు అర్పించి నివాళులర్పించి ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ సెంటర్ వద్ద అడపా శ్రీను నేతృత్వంలో టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పీసీ చైర్మన్ దేవనబోయి వెంకటేశ్వరరావు, తుంగల వెంకటగిరి, భోగాది చంద్రశేఖర్, రాజనాల వీరబాబు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, బొప్పన భాను, యాసం చిట్టిబాబు, గుత్తికొండ వరప్రసాద్, యలవర్తి చిన్నా, సింహాద్రి పవన్, అడపా శ్రీను, పరుచూరి దుర్గాప్రసాద్, కర్రా సుధాకర్, మండలి రామ్మోహనరావు, గాంధీ క్షేత్రం కమిటీ సభ్యులు మత్తి శ్రీనివాసరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, మాచవరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘంగా మార్చేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపటంపై మండల కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. కో దూరు ప్రధాన సెంటర్‌లోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య, కోట రాంబాబు, కాగిత రామారావు, అద్దంకి పాండురంగారావు, బడే భావన్నారాయణ, కొండవీటి సునీత, పూతబోయిన సాయి, కరుణకుమార్, కొల్లి చిన్నబాబు, పిచ్చేశ్వరరావు, కడవకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శిక్షణ అనంతరం అవార్డు అందుకుంటున్న బాలాజీ, సత్కరిస్తున్న యోగా గురువులు

కలెక్టర్ బాలాజీకి ఉత్తమ ఐఏఎస్ అవార్డు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ముస్సోరీలో ఇటీవల ప్రత్యేక శిక్షణ పూర్తయ్యాక ఉత్తమ ఐఏఎస్ అధికారి అవార్డును కలెక్టర్ డీకే బాలాజీ అందుకున్నారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బర్దన్ నుంచి కలెక్టర్ బాలాజీ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. నాలుగు వారాల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకుని విచ్చేసిన కలెక్టర్ బాలాజీ గురువారం గాంధీనగర్ ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు, మహాలక్ష్మి, మద్దాల చింతయ్య, శీలం రమేష్, వడ్డి శ్రీనివాస్, యోగా సభ్యులు ఘనంగా సత్కరించారు. యోగ సభ్యులు తేజస్వికుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వరప్రసాద్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు చిన్న నరసింహులు, జిల్లా పరిషత్ ఏవో మానేపల్లి శ్రీనివాస్, విశ్రాంత అగ్నిమాపక అధికారి జగన్‌మోహనరావు, ఆర్‌డీ ప్రసాద్, అశోక్, రేఖ, రంజిత, రాజకుమారి, మాటూరు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కృత్తివెన్నులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

స్త్రీశక్తితో మహిళలకు మరింత ఆర్థిక భరోసా

కృత్తివెన్ను, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకంతో మహిళలకు మరింత ఆర్థిక భరోసా కలిగిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కృత్తివెన్నులోని టీడీపీ కార్యాలయం వద్ద స్త్రీశక్తి పథకం అమలు సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మె ల్యే కాగిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చుతోందన్నారు. సుమారు 1942 కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ మహిళల సంక్షేమం కోసం మరో అడుగు ముందుకేసి, ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమానంగా ముం దుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనీయమన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, నాయకులు కూనసాని చిన్న, చేకూరి వెంకట్రావు, నడకుదిటి ఆంజనేయులు, బొర్రా ఏడుకొండలు, అధికారి అప్పి, కూనసాని అశోక్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పీఏసీఎస్‌లో ఎరువుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం సీతారామపురం పీఏసీఎస్‌లో గురువారం అధ్యక్షుడు ఈడే రాంబాబు ఆధ్వర్యంలో ఎరువులను పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో సొసైటీ ద్వారా 15 టన్నుల యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. కాంప్లెక్స్ ఎరువులు అందజేస్తామన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్లు గణేశన రామారావు, కాగిత వీరరాఘవయ్య, కార్యదర్శి జోగి శ్రీనివాసరావు, ఎంఏవో ఎం.రామ్‌కుమార్, వీఏఏ కరుణ, రైతులు పాల్గొన్నారు.

దళితవాడల్లో చవితి వేడుకలు నిర్వహించాలి

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దళితవాడల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా మఠ్ మందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ విజ్ఞప్తి చేశారు. పులిగడ్డ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సాహపూరిత వాతావరణంలో చవితి ఉత్సవాలు నిర్వహించాలని కృష్ణ కోరారు.



క్రీడా పరికరాల వితరణ

మోపిదేవి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కె.కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ పూషడపు రత్నగోపాల్ రూ.7 వేల విలువైన క్రీడా పరికరాలు అందజేశారు. క్రీడా పరికరాలను కూటమి నాయకులతో కలసి ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్‌కు అందించారు. మత్తి వంశీకృష్ణ, నాగమల్లేశ్వరరావు, మండలి రమణ, జి.మారుతి ఉన్నారు.

శ్మశాన వాటిక గేటుకు రూ.40 వేల విరాళం

కోడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నరసింహపురం రోడ్డులోని హిందువుల శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో భాగంగా గేటుకు రిటైర్డ్ డీఎస్పీ కోటగిరి ఉదయ భాస్కర్ సతీమణి కోటగిరి శ్రీదేవి రూ.40 వేలు విరాళాన్ని అందజేసినట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు జూపూడి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శ్రీదేవి తల్లిదండ్రులు పండలనేని రామారావు - నాంచారమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేశారన్నారు. అభివృద్ధికి సహకారం అందించిన కోటగిరి శ్రీదేవికి అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



లేడియాంప్తిల్ విద్యార్థినులకు గుర్తింపు కార్డులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లేడియాంప్తిల్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు గుర్తింపు కార్డులను కొల్లు జ్ఞానసాయి అందజేశారు. కార్యక్రమానికి న్యాయవాది బాలాజీ ము ఖ్యఅతిథి పాల్గొన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ కార్యదర్శిగా కొల్లు శ్రీనివాసరావు పది సంవత్సరాల నుంచి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారి లంకిశెట్టి హరనాథ్, అధ్యాపకులు విజయశ్రీ, సుందరలక్ష్మి, కిరణ్మయి, షాహిదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మ ల్లవోలులోని ముదిరాజ్‌పాలెంకు చెందిన పిట్టల సంజీవకుమారి గురువారం మృతిచెందింది. అంత్యక్రియల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేసింది. మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ మోహన్ త్రినాథ్, వాకాలయ్య, పోతురాజు, దుర్గారావు, పిట్ల భిక్షాలు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోండి

● పేర్నికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మచిలీ పట్నం కార్పొరేషన్ పరిధిలోని పార్టీ కార్యాలయం భవనం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం భౌతికంగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నానిని హైకోర్టు ఆదేశించింది. దానిని పరిగణనలోకి తీసుకుని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్‌కు స్పష్టం చేసింది. భవనం విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ఏలూరు కార్యాలయం భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం భౌతికంగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 17కి వాయిదా వేసింది.